సాక్షి మంచిర్యాల

ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



లాఠీ ఎత్తారు..
ఠాణాలోనే ఇరువర్గాలు ఒకరిపైనొకరు దాడి చేసుకున్నారు. దీంతో పోలీసులు అప్రమత్తమై లాఠీ ఝుళిపించారు. రెండు వర్గాల ఆధిపత్య దాడులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. 8లో ▸



ప్లాస్టిక్ వాడకం ప్రమాదకరం
ప్లాస్టిక్ వస్తువుల వినియోగం ప్రాణాంతకమని డీపీవో వెంకటేశ్వర్‌రావు కిరాణ దుకాణ యజమానులకు సూచించారు. శనివారం మండలాల్లో స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. 9లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
33.0 /26.0
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

అప్పీలు లేని అంతిమ తీర్పు

మంచిర్యాలక్రైం: లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పు అప్పీలు లేని అంతిమ తీర్పు అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నారు. స్థానిక జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పాత కేసుల్లో కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో సుమారుగా 4వేల వివిధ రకాల కేసులు పరిష్కారం అయ్యాయని, 94 బ్యాంకు కేసుల్లో 13సైబర్ క్రైమ్ కేసులు పరిష్కరించామని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు అర్పిత మారంరెడ్డి, సంపత్, నిరోష, ఉపనిషద్వని, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం



కక్షిదారులను విచారిస్తున్న జడ్జి రవి

చెన్నూర్: రాజీ మార్గమే రాజమార్గమని మండల లీగల్ సర్వీసు చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి అన్నారు. స్థానిక కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. రాజీ కోసం వచ్చిన కక్షిదారులను విచారించారు. ఈ సందర్భంగా జడ్జి రవి మాట్లాడుతూ క్షణికావేశంలో చిన్న చిన్న తగదాలతో కోర్టులో కేసులు వేసి సమయాన్ని వృథా చేసుకోవద్దని తెలిపారు. లోక్ అదాలత్‌లో బ్యాంక్ కేసులు 79, డ్రంక్ అండ్ డ్రైవ్ 193, అడ్మిషన్ కేసులు 51, క్రిమినల్ కేసులు 51, సివిల్ కేసులు 4 పరిష్కారం అయ్యాయి. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌చందర్ గిల్డా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.రవీందర్, పోలీసు అధికారులు, న్యాయవాదులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ ఓటర్లు 3,78,934



వేంపల్లిలో ఓటరు జాబితా ప్రదర్శన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పంచాయతీ ఎన్నికల దృష్ట్యా సిద్ధం చేసిన తుది ఫొటో ఓటరు జాబితాలను జిల్లా వ్యాప్తంగా శనివారం పంచాయతీల్లో ప్రదర్శించారు. జిల్లాలోని 16 మండలాల్లో 311 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో దండేపల్లి మండలం వందూరుగూడ గ్రామ పంచాయతీ మినహా 310 పంచాయతీల్లో ఫొటో ఓటరు గుర్తింపు జాబితాను ప్రదర్శనగా ఉంచారు. జిల్లాలోని 310 పంచాయతీల్లో 1,78,412 మంది పురుష ఓటర్లు, 1,91,505 మంది మహిళా ఓటర్లు, 17 ఇతర ఓటర్లు కలిపి మొత్తంగా 3,78,934 మంది ఉన్నారు. సవరణలు, మార్పులు, చేర్పులు, చనిపోయిన ఓటర్ల పేర్ల తొలగింపు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పు, తప్పుల సవరణ వంటి వాటితోపాటు కొత్త ఓటర్ల నమోదు పూర్తి చేసి తుది జాబితా ప్రదర్శనగా ఉంచారు.

లక్సెట్టిపేటకు చేరిన యాత్ర



స్వాగతం పలుకుతున్న నాయకులు

లక్సెట్టిపేట: మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలని చేపట్టిన మాదిగల మేలు కొలుపు యాత్ర శనివారం లక్సెట్టిపేట మండలానికి చేరింది. మండలంలోని నాయకులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి మాట్లాడుతూ ఈ నెల 25న యాత్రను హైదరాబాద్‌లో ప్రారంభించామని తెలిపారు. అన్ని జిల్లాలు, మండలాలను కలుపుతూ యాత్రను పూర్తి చేస్తామని తెలిపారు. నాయకులు దుబ్బన్న, నవీన్‌కుమార్, రవికుమార్, కాంతారావు, నాగరాజు, సతీష్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

నస్పూర్: జీవన శైలిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్యాధికారి హరీష్‌రాజ్ అన్నారు. ప్రపంచ గుండె సంబంధిత వ్యాధుల నివారణ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతీరోజు వ్యాయామం చేయాలని సూచించారు. అనంతరం మున్సిపల్, పీహెచ్‌సీ సిబ్బందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, కమిషనర్ చిట్యాల సతీష్, జిల్లా ఉపవైద్యాధికారి అనిత, పీహెచ్‌సీ వైద్యాధికారి సమత, డాక్టర్లు రుబీనా, శివప్రసాద్ పాల్గొన్నారు.


ఎకో టూరిజం



జిల్లాలోని అటవీ ప్రాంతాలు



గాంధారి ఖిల్లాలో ట్రెక్కింగ్ చేస్తున్న పర్యాటకులు



- పర్యావరణహితంగా పర్యాటకం
- స్థానిక వనరులపై పూర్తయిన సర్వే
- జిల్లా అటవీ శాఖ ప్రత్యేక ప్రణాళిక

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రకృతి రమణీయతకు నిలయంగా పేరున్న జిల్లాలో అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. అనేక మంది ఈ ప్రాంత అందాలను చూసేందుకు వస్తుంటారు. పర్యాటకులకు సౌకర్యాలు లేకపోవడం, దూరభారంతో చాలామంది వెనుకడుగు వేస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం పర్యాటక రంగాన్ని మరింత వృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉండడంతో జిల్లా పరిధిలో ఎకో టూరిజం అభివృద్ధి పరిచేందుకు అటవీ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రకృతి ఒడిలో గడపాలనుకునే వారికి ఇక నుంచి ప్రత్యేక సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఔత్సాహికుల అభిరుచుల మేరకు వసతుల కల్పనపై దృష్టి సారించింది. ఈ మేరకు కొద్ది రోజులుగా స్థానికంగా ఉన్న వనరులు, అవకాశాలపై సర్వే చేసింది. దీంతో పర్యాటకులకు అవసరమైన వాటిపై దృష్టి సారించింది. దీంతో గిరిజన, ఆదివాసీ, ఆధ్యాత్మిక, చారిత్రక ప్రదేశాలను కలుపుతూ ఒక కేంద్రంగా మార్చనుంది.

ప్రత్యేక ఆకర్షణగా 'గాంధారి'

మంచిర్యాలకు సమీపంలో ఉన్న మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారు గాంధారి ఖిల్లా పరిసరాలు, అటవీ ప్రాంతానికి ప్రతీరోజు అనేక మంది వస్తుంటారు. చారిత్రక, ఆధ్యాత్మిక, పచ్చని అడవులు, కొండలు, నీటి వనరులు సందర్శిస్తూ.. మైసమ్మ తల్లి దర్శనంతోపాటు అడవిలో ఆనందంగా గడిపేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఆ పరిసరాల్లో ప్లాస్టిక్‌తోపాటు చెత్తాచెదారం, మద్యం సీసాలు, మిగిలిపోయిన భోజనం, వంటలు వదిలివేసి వెళ్తున్నారు. ఇక కొందరు డీజే సిస్టం, సౌండ్ బాక్సులు ఏర్పాటు చేసుకుంటూ అడవిలో ఉన్న వన్యప్రాణులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. కోతులు సమీప ప్రాంతాల్లోకి వస్తూ దాడులు చేస్తున్నాయి. వాహనాలు ఇష్టారీతిన పార్కింగ్ చేస్తున్నారు. కొత్తగా ప్లాంటేషన్ జరిగిన చోట్ల మొక్కలను ధ్వంసం చేస్తున్నారు. గాంధారి వనం పార్కులో స్థానికులు ఉదయం పూట కాలినడక నుంచి సాయంత్రం దాకా వస్తున్నారు. ఇక్కడ ప్రవేశానికి రుసుం వసూళ్లు చేస్తున్నారు. గాంధారి ఖిల్లా పరిసరాల్లో ఎటువంటి రుసుం లేకపోవడంతో అనేక మంది అటువైపు వెళ్తున్నారు. ఇక నుంచి ఇలాంటివి చేయకుండా పర్యావరణహితంగా ఉండేలా అటవీశాఖ జాగ్రత్తలు తీసుకోనుంది. వనసంరక్షణ సమితి ఆధ్వర్యంలోనే ప్లాస్టిక్ నివారణ చర్యలు తీసుకోనున్నారు.

ఎన్నో ప్రయోజనాలు

ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నప్పటికీ సరైన ప్రచారం, సౌకర్యాల కల్పన లేక ఆశించిన ప్రయోజనాలు అందుకోలేకపోతున్నాం. దేశంలో అనేక పర్యాటక ప్రాంతాల్లో స్థానికులకు ఉపాధితోపాటు ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చేలా వ్యవస్థలు ఉన్నాయి. ఇదే తీరుగా ఇక్కడి వనరులను పర్యావరణహితంగా ఉపయోగించుకోగలిటే ఎంతో ప్రయోజనం కలుగనుంది. మంచిర్యాల పరిసర ప్రాంతాలకు జాతీయ రహదారులతోపాటు రైల్వే మార్గం ఉండడంతో దేశంలో ఏ ప్రాంతానికైనా రాకపోకలకు వీలు కలుగనుంది. ఇక్కడి వనరులను ప్రణాళికబద్ధంగా ఉపయోగిస్తే జిల్లా అభివృద్ధికి తోడ్పనుంది.

ఏడాది పొడవున పర్యాటకం



పర్యావరణహితంగా ఆతిథ్యానికి అవకాశమున్న అన్ని అంశాలపై సర్వే చేశాం. అడవులను సందర్శించే ఔత్సాహికులకు ఓ ప్రత్యేక అనుభూతిని కలిగించేలా ఏర్పాట్లు చేస్తాం. ఇక నుంచి కవ్వాల్ సఫారికే పరిమితం కాకుండా ఏడాది పొడవునా అటవీ ప్రాంతాలను సందర్శించేలా ఎకో టూరిజంను అభివృద్ధి చేస్తాం. దేశం నలుమూలల నుంచి ఈ ప్రాంతానికి వచ్చేలా చర్యలు చేపడుతాం. పట్టణానికి దగ్గరలో ఉన్న గాంధారి ఖిల్లాను ఆ మేరకు సిద్ధం చేస్తున్నాం. ఇందుకు ప్రత్యేక వ్యవస్థను తీసుకురాబోతున్నం.

– శివ్‌ఆశీష్ సింగ్, జిల్లా అటవీ అధికారి

పర్యాటకుల అభిరుచి మేరకు..

పర్యాటకుల అభిరుచి మేరకు అడవుల్లో నడక, రాఫెల్లింగ్, ట్రెక్కింగ్, సైక్లింగ్, రిజర్వు ఫారెస్టులోకి సందర్శనలు, క్యాంపెయినింగ్‌లు, విద్యార్థులకు అడవులపై అవగాహనతోపాటు వన్యప్రాణులను ప్రత్యక్షంగా చూపించడం, జలపాతాల సందర్శనకు ఏర్పాట్లు చేయనున్నారు. ఇక్కడి అరుదైన జంతుజాలాలను చూపించడం, పక్షులు వాటి ప్రత్యేకతను వివరిస్తూ ఇక్కడి ప్రత్యేకతను తెలియజేయనున్నారు. సీజన్ వరకే పరిమితం కాకుండా ఏడాది పొడవునా అడవుల్లో గడిపేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జన్నారం, లక్సెట్టిపేట, చెన్నూరుతోపాటు గోదావరి, ప్రాణహిత, కడెం తీరాలు, శివ్వారం మొసళ్ల సంరక్షణ, జింకల పార్కులు, గూడెం, కోటిలింగాల, క్వారీ లోయ, జలపాతాలు, వృక్షశిలాజాలు తదితర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలుగా ఏర్పాట్లు చేయనున్నారు. ఇప్పటికే కవ్వాల్ టైగర్ రిజర్వు వారంతాలు, సెలవు దినాల్లో పర్యాటకులు వస్తున్నారు. సఫారీతోపాటు అడవిని ప్రత్యక్షంగా చూసేందుకు అవకాశం కల్పిస్తున్నారు. పర్యాటక, అటవీ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తోంది.

'మాఫీ' కాలే.. 'భరోసా' రాలే..!

- సర్వేలు, ప్రజాభిప్రాయ సేకరణతోనే సాగదీత
- ముగింపు దశకు వానాకాలం సీజన్
- 'సాయం' అందక ఆర్థిక ఇబ్బందుల్లో రైతులు



నారు వేస్తున్న రైతులు(ఫైల్)

మంచిర్యాలఅగ్రికల్చర్: రుణమాఫీ కాని రైతులు ఫిర్యాదులు అందజేసి, మరోవైపు కుటుంబ సర్వే చేపట్టి నెల రోజులు గడుస్తోంది. పంట పెట్టుబడి సాయం రైతుభరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ ముగిసి మాసం గడుస్తోంది. రూ.2లక్షల రుణమాఫీ వర్తించక కొందరు, రైతుభరోసా పెట్టుబడి సాయం అందక రైతులందరూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెలతో వానాకాలం సీజన్ ముగియనుంది. మరోకొద్ది రోజుల్లో పంటల దిగుబడి చేతికి రానుంది. ఖరీఫ్ పంట పెట్టుబడి సాయం అమలు చేయకపోవడంతో రైతులు అప్పులు చేసి సాగు చేశారు. గత ఏడాది బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణం ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మాఫీ అవుతుందని ఆశతో జిల్లాలో చాలామంది రైతులు ఎదురు చూస్తున్నారు. తీసుకున్న రుణం చెల్లించక పోగా కొత్త రుణం ఇచ్చేందుకు బ్యాంకర్లు నిరాకరిస్తున్నారు. ప్రభుత్వం మూడు విడతల్లో పంట రుణాలు మాఫీ చేసినా జిల్లాలో చాలామంది రైతులకు మాఫీ కాలేదు. రూ.2లక్షల కంటే ఎక్కువ లోన్ ఉన్న రైతులతోపాటు కుటుంబంలో భార్యాభర్తలు తీసుకున్న రుణం, రేషన్ కార్డు ప్రామాణికం కాదంటూనే పరిగణలోకి తీసుకోవడం, ఆధార్‌కార్డు, పాస్‌పుస్తకంలో తప్పొప్పులు తదితర కారణాలతో వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదు. మరికొందరికి రూ.2లక్షలకు అదనంగా ఉన్న బకాయిని సాకుగా చూపిస్తూ రుణమాఫీ చేయకపోవడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. మూడు విడతల్లో రుణమాఫీ అమలుతో జిల్లాలో మొత్తం 56 వేల మంది రైతులకు గాను రూ.465 కోట్లు మాఫీ చేసింది.

అందని పెట్టుబడి సాయం..

వ్యవసాయనికి పెట్టుబడి సాయం రైతుబంధు పథకం 2018లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మొదట్లో ఎకరానికి రూ.4 వేల చొప్పున, ఆ తర్వాత రూ.5 వేలు, వానాకాలం, యాసంగి రెండు సీజన్లకు ఎకరానికి రూ.10 వేల చొప్పున రైతుల ఖాతాల్లో వేసింది. ప్రస్తుత ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని రైతుభరోసా పథకంగా మార్చి ఎకరానికి రూ.7,500 చొప్పున రెండు సీజన్లకు గాను రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తోంది. వానాకాలం సీజన్ ముగింపు దశకు వచ్చినా రైతుభరోసా పథకం అమలు చేయకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి పంటలు విత్తుకున్నామని వాపోతున్నారు. గత ఆరేళ్లుగా వానాకాలం సీజన్ జూన్‌లో పెట్టుబడి సాయం అందుకున్న రైతులు ఈ ఏడాది సెప్టెంబర్ ముగింపు దశకు వచ్చినా అందకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి గతంలో కంటే ఎకరానికి రెండున్నర వేలు అదనంగా వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే ఎదురవుతోంది.

కుటుంబ సర్వే నెల గడిచింది..

వచ్చే నెల నుంచి యాసంగి సీజన్ ప్రారంభం కానుంది. గత ప్రభుత్వం అనర్హులు, భూస్వాములకు రైతుబంధు పథకం అమలు చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం రైతుభరోసా పథకం అమలుకు ఎన్ని ఎకరాలకు కటాఫ్, అర్హులైన రైతుల గుర్తింపునకు జిల్లా ల వారీగా సమావేశాలు నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి నెల రోజులు గడుస్తోంది. రుణమాఫీ అమలు కాని రైతులు వేల సంఖ్యలో వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు గత నెల 28 నుంచి రేషన్‌కార్డు లేక రుణమాఫీ కాని రైతుల కుటుంబ నిర్ధారణ సర్వేను వ్యవసాయ అధికారులు చేపట్టారు. ఇంటింటికి వెళ్లి రైతుల ఫొటోలు తీసుకోవడం, వివరాలు నమోదు చేసుకోవడం 90 శాతం పూర్తయింది. తదుపరి కార్యాచరణపై ఇంకా ఎ లాంటి ఆదేశాలు వెలువడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నాలుగు నెలలు అవుతుంది..



పంట రుణమాఫీ రెండు లక్షల కన్న ఎక్కువ ఉందనో ఏదో తిరకాసుతో మాఫీ చేయలేదు. మరో దిక్కు వానాకాలం పంట పెట్టుబడి సాయం రైతుభరోసా ఎకరానికి రూ.7,500 అన్నరు. వానాకాలం పంటలు వేసుకొని నాలుగు నెలలు అవుతుంది. ఇప్పటివరకు మాఫీ కాలేదు. రైతుభరోసా రాలేదు. – జాపాతి నారాయణ, నెన్నెల

అప్పులు చేసి పంటలు



రేషన్‌కార్డు ఉన్నది, కుటుంబంలో ఒక్కన్నే లోను తీసుకున్న. ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకంలో పేరు అన్నీ కరెక్టుగానే ఉన్నయి. నాకు రూ.1.60 లక్షలలోపే లోను ఉంది. అయినా మాఫీ కాలేదు. చెన్నూర్ ఏవో, కలెక్టర్ ఆఫీసుల్లో ఫిర్యాదు చేసినా రుణమాఫీ కాలేదు. అటు పంట పెట్టుబడి సాయం అందలేదు. అప్పులు చేసి ఈయేడు పంటలు వేసుకోవాల్సి వచ్చింది.

– కస్తూరి మల్లయ్య, గ్రామం: పొన్నారం, మం: చెన్నూర్

చెన్నూర్ అభివృద్ధికి కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



సమావేశంలో కలెక్టర్ కుమార్‌దీపక్, ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ నియోజకవర్గంలో అన్ని రంగాల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. చెన్నూర్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వివేకానందతో కలిసి జిల్లా, మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకంలో భాగంగా నియోజకవర్గంలోని అన్ని ఇళ్లకు నల్లా కనెక్షన్ల ద్వారా తాగునీరు అందించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రుల్లో సరిపడా మందుల నిల్వలను అందుబాటులో ఉంచాలన్నారు. మహిళా శక్తి పథకం ద్వారా స్వావలంబన దిశగా స్వయం సహాయక సంఘాల మహిళలను ప్రోత్సాహించాలని, క్యాంటీన్లు, డెయిరీఫాం, కోళ్లు, చేపల పెంపకం ఇతర అంశాల్లో చేయూతనందించాలని తెలిపారు. ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అంతర్గత రహదారుల పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాలని, కాంట్రాక్టర్ల సమన్వయంతో పనులు వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

రేబిస్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: వీధి కుక్కల కారణంగా వ్యాప్తి చెందే రేబిస్ వ్యాధిపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం అంతర్జాతీయ రేబిస్ వ్యాధి దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రాథమిక పశు వైద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శంకర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెంపుడు జంతువులకు సమయానుసారంగా రేబిస్–వ్యాక్సినేషన్ చేయించాలని, కుక్క కరిచిన వెంటనే రేబిస్ వ్యాక్సినేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని, ఆలస్యం చేస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో రోజుకు 40 నుంచి 50 వీధి కుక్కలకు సర్జరీ చేయడం చేయిస్తామని తెలిపారు. జిల్లా పశు వైద్యాధికారి రేబిస్ వ్యాధి దినోత్సవం ప్రాముఖ్యత, వ్యాధి నివారణ మార్గాలను వివరించారు. మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మంచిర్యాల పశు వైద్యాధికారి డాక్టర్ శంకర లింగం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, పెంపుడు జంతువుల యజమానులు, జంతు ప్రేమికులు పాల్గొన్నారు.

బాధితులకు భరోసా కల్పించాలి

- రామగుండం సీపీ శ్రీనివాసులు
- రామకృష్ణాపూర్ పోలీసుస్టేషన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాసులు

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందనే భరోసాను పోలీస్ సిబ్బంది కల్పించాలని రామగుండం సీపీ శ్రీనివాసులు అన్నారు. శనివారం రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. నమోదైన కేసులు, ఫిర్యాదుదారులతో సిబ్బంది ప్రవర్తన విషయమై తెలుసుకున్నారు. అదృశ్యం, నేర కేసుల్లో ఆధారాల సేకరణ, ఫిర్యాదులు అందిన వెంటనే ఆధారాలు, సాక్ష్యాలను సేకరించడం, ప్రధానమైన సాక్షులతో వెంటనే మాట్లాడి వివరాలు సేకరించి రికార్డు పరంగా నమోదు చేసుకోవాలని సూచించారు. రాబోయే పండుగల సందర్భంగా బందోబస్తుపై సూచనలు చేశారు. బ్లూ కోల్ట్స్ , పెట్రోకార్ సిబ్బంది రాత్రి సమయంలో రౌడీషీటర్స్, కేడీలు, డీసీలు, సస్పెక్ట్ షీట్స్‌ల ఇళ్లను పాయింట్ బుక్స్ తప్పనిసరిగా తనిఖీ చేయాలని తెలిపారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

వ్యర్థాలతో కళాకృతులు



కొబ్బరి పెంకులతో కళాకృతులు



అట్టముక్కలతో తయారు చేసిన బొమ్మలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో యాదయ్య



అట్టముక్కలతో రామమందిరం

మంచిర్యాలఅర్బన్: ఎందుకూ పనికిరావు అనుకునే వాటితో సైతం విద్యార్థులు అందమైన కళాకృతులు తీర్చిదిద్దారు. అట్టముక్క, కొబ్బరిచిప్ప, పగిలిన గాజులు ఇలా వ్యర్థాలతో రూపుదిద్దుకున్న ఆకృతుల ప్రదర్శన ఆకట్టుకుంది. శనివారం స్థానిక జిల్లా సైన్స్ కేంద్రంలో నేషనల్ గ్రీన్‌కోర్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వర్థం నుంచి అర్థం అనే అంశంపై ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. 54పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రదర్శనకు తరలివచ్చారు. కొబ్బరి పెంకులు, పల్లి, పిస్తా పొట్టు ఉపయోగించి అలంకరణ వస్తువులు, అట్టముక్కలతో శివలింగం, ప్లాస్టిక్ వాటర్ బాటిల్ పూల బోకె, అయోధ్య రామమందిరం, గాజుముక్కలతో కోడిపుంజు తయారు చేసి అబ్బురపర్చారు. ఎగ్జిబిషన్‌ను జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ సందర్శించారు. జెడ్పీహెచ్‌ఎస్ ముత్యంపల్లికి చెందిన బిందుప్రియ, విశ్వసూర్య ప్రథమ, జెడ్పీహెచ్‌ఎస్ ముల్కల్లకు చెందిన విద్యార్థులు రిషీత, రక్షిత ద్వితీయ, భీమారం కేజీబీవీ విద్యార్థులు అంబిక, నక్షత్ర తృతీయ స్థానంలో నిలిచారు. ధర్మారావుపేట్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు సాహిత్య, శ్రీవర్ష, జెడ్పీహెచ్‌ఎస్ వెల్గనూర్‌కు చెందిన అభిలాష్, మణిదీప్, జెడ్పీహెచ్‌ఎస్ జెండా వెంకటపూర్‌కు చెందిన అభిలాష్, రాకేష్, టీజీఆర్‌ఎస్ బెల్లంపల్లికి చెందిన జశ్వంత్, శ్రీకర్, కేజీబీవీ నస్పూర్‌కు చెందిన అంజలి, అక్షయలకు కన్సోలేషన్ బహుమతులను డీఈవో యాదయ్య అందజేశారు. సైన్స్ అధికారి మధుబాబు, ఎన్జీసీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ విద్యాసాగర్, సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, ప్రధానోపాధ్యాయులు దత్తకుమార్, సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకటేశ్వరావు, అర్చన, తదితరులు పాల్గొన్నారు.



గడ్డితో గుర్రంబొమ్మ

క్లుప్తంగా

గంజాయి మొక్కలు పట్టివేత



మొక్కలు స్వాధీనం చేసుకుంటున్న సీఐ

ఇచ్చోడ: మండలంలోని గుబ్బ గ్రామంలో పత్తి పంటలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను పక్కా సమాచారంతో సీఐ భీమేశ్ ఆధ్వర్యంలో శనివారం పట్టుకున్నారు. సీఐ కథనం ప్రకారం..కోవ హనుమంత్‌కు చెందిన వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన పెందుర్ మానిక్యరావు కౌలు తీసుకుని సాగు చేస్తున్నాడు. పత్తిలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్న 30 మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీటి విలువ రూ.45 వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ దగ్ధం



దగ్ధమైన బైక్

భీమిని: కన్నెపల్లి మండలం నాయకునిపేట పంచాయతీ పరిధిలోని మొక్కంపల్లి (కుర్మగూడెం) గ్రామంలో శనివారం పల్సార్ బైక్ దగ్ధమైంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గాదర్ల మహేశ్ తన ఇంటి ముందు షెడ్డులో బైక్ పెట్టాడు. ఒగ్గు కథ చెప్పడానికి చెన్నూర్‌కు వెళ్లాడు. శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా బైక్ నుంచి భారీ శబ్దం వచ్చి మంటలు చెలరేగాయి. దీంతో మహేశ్ తల్లి ప్రేమల బయటికి వచ్చి చూడగా అదే గ్రామానికి చెందిన గాదర్ల రాజేశ్ పరిగెడుతూ కనిపించడం చూసింది. బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు.

యువకుడి బైండోవర్

నెన్నెల: సోషల్ మీడియాలో సీఎం రేవంత్ రెడ్డి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌పై అభ్యంతకర పోస్టుపెట్టిన ఓ వ్యక్తిని సోమవారం తహసీల్దార్ సబ్బ రమేశ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మండలంలోని కొత్తూర్‌కు చెందిన యువకుడు తలండి నాగేశ్ ఇటీవల సీఎం, ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ జలీల్ ఫిర్యాదు మేరకు బైండోవర్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఎవరైనా రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

లాఠీ ఎత్తారు..!

- మంచిర్యాల పోలీస్‌స్టేషన్ సాక్షిగా ఇరువర్గాల దాడి
- ఈనెల 23న ఘటన
- వరుస దాడులతో జనం బెంబేలు



గతేడాది సెప్టెంబర్‌లో బైపాస్‌రోడ్‌లోని జగన్‌మోహన్‌రావు ఇంటి వద్ద దాడులు చేస్తున్న ఓ వర్గం

మంచిర్యాలక్రైం: ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అమలుతో పోలీసులు పెద్దగా లాఠీలకు పని చెప్పినా దాఖలాలు లేవు. చాలాకాలం తర్వాత ఖాకీలు లాఠీలకు పనిచెప్పినా వీడియో వైరల్ అయింది. జిల్లాకేంద్రంలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బైపాస్ రోడ్‌లో ఈనెల 23న అర్ధరాత్రి కాంగ్రెస్ నాయకుడు జగన్‌మోహన్‌రావు వద్ద పనిచేసే మేర సంజీవ్‌పై జరిగిన దాడి కేసులో పోలీసులు కొందరిని స్టేషన్‌కు పిలిపించినట్లు సమాచారం. కేసులో సంబంధం లేని వ్యక్తులను పిలవడంతో ఓ వర్గానికి చెందిన వారు అక్కడికి వెళ్లారు. మరో వర్గానికి చెందిన వారు అక్కడే ఉన్నారు. స్టేషన్ సాక్షిగా రెండువర్గాల మధ్య మాటామాట పెరిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. పోలీసులు వారిపై లాఠీ ఝుళిపించారని తెలిసింది.

వరుస దాడులు..

జిల్లాలో వరుసగా గ్యాంగ్‌లు, ఇరువర్గాలు పరస్పరం దాడులతో పట్టణ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. స్టేషన్‌కు వచ్చిన యువకులపై లాఠీ ఝుళిపించడం, గొడవలు జరుగుతుంటే శాంతిభద్రతలు పరిరక్షణలో పోలీసులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫ్రెండ్లీ పోలీసింగ్ కాస్త..మంచిర్యాల పోలీసుల తీరుతో 'పోకిరి'పోలీసింగ్ విధానంగా మారిందనే విమర్శలున్నాయి. 2022 జిల్లా కేంద్రంలో ఎల్‌ఐసీ కాలనీలో ప్రారంభమైన గ్యాంగ్ దాడి మొదలుకొని వరుస దాడులు ప్రస్తుతం పోలీస్‌స్టేషన్ వరకు చేరుకోవడం, ఈ దాడుల్లో ఖాకీలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

- జిల్లాకేంద్రంలో ఇప్పటికే గ్యాంగ్ లీడర్ల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. ఓ వర్గానికి రాజకీయ, పోలీసుల బలం మెండుగా ఉన్నట్లు సమాచారం. రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరును అరికట్టడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. రాజకీయ బలం, ధన భలం ఉన్నవారికే పోలీస్ యంత్రాంగం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.
- 2022, మే నెలలో ఎల్‌ఐసీ కాలనీలో ఓ భూవివాదంలో ఇంటి నిర్మాణం తొలగించడానికి ఓ ముఠా వీరంగం సృష్టించింది. 10 మంది మద్యం తాగి క్రికెట్ బ్యాట్లు, గడ్డపార పట్టుకుని హల్‌చల్ చేశారు. స్థానికులు 100 డయల్‌కు ఫోన్ చేయడంతోపోలీసులు వచ్చేసరికి పారిపోయారు.
- అదేనెలలో శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద రెండు వర్గాల మధ్యం జరిగిన దాడిలో ఒకరు తీవ్ర గాయలపాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. అప్పటి నుంచి వరుసగా గ్యాంగ్‌లీడర్ల ఆరాచకాలు రోజురోజుకు పెట్రేగిపోతున్నాయి. ఏకంగా పోలీస్‌స్టేషన్ వరకు చేరుకుందంటే జిల్లాలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.
- గతేడాది సెప్టెంబర్‌లో జిల్లా కేంద్రంలో గణేష్ నిమజ్జనం రోజున మద్యం మత్తులో రెండు వర్గాల మధ్య గొడవ పెద్దదిగా మారింది. బైపాస్ రోడ్‌లోని జగన్‌మోహన్‌రావు ఇంటిపై క్రికెట్ బ్యాట్లు, ఇనుప రాడ్లతో రెండు వర్గాలు దాడులు చేసుకుని బీభత్సం సృష్టించాయి.
- 2024 మే 14న ఐబీ చౌరస్తా సమీపంలో మా విందు హోటల్ ఎదుట రెండు వర్గాల దాడుల్లో ఇరువురికి గాయాలయ్యాయి. సీసీ ఫుటేజీ ఆధారంగా పలువురిపై కేసులు నమోదైంది.
- గత జూన్ 2న బీఆర్‌ఎస్ యువ నాయకుడు గడప రాకేశ్‌పై ఓ వర్గానికి చెందిన గ్యాంగ్ దాడి చేసింది. దాడిచేసిన వారిపై కేసులు గుట్టుచప్పుడు కాకుండా కేసు నమోదు చేశారు.
- ఈనెల 23న బైపాస్ రోడ్‌లో కాంగ్రెస్ నాయకుడు జగన్‌మోహన్‌రావు ఇంటి వద్ద మేర సంజీవ్‌పై బీఆర్‌ఎస్ యువనాయకుడు గడప రాకేశ్ అనుచరులు దాడికి పాల్పడ్డారు. ఆత్మరక్షణ కోసం సంజీవ్ ఎదురు దాడి చేయగా ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి.
- ఈనెల 25న పోలీస్‌స్టేషన్ ఆవరణలో రెండు వర్గాలు దాడి చేసుకున్నాయి. పోలీసుల లాఠీ ఛార్జ్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

చర్యలు తీసుకుంటాం



జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిసే చర్యలు తీసుకుంటాం. రెండువర్గాల మధ్య దాడులు, ఉనికి చాటుకునేందుకు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడుతున్నారు. రాజకీయాలకతీతంగా కేసులు నమోదు చేయడంతోపాటు రౌడీషీట్, పీడీయాక్టు నమోదు చేస్తాం. ఈనెల 25న పోలీస్‌స్టేషన్ లోపల రెండువర్గాలు దాడి చేసుకున్న విషయం నా దృష్టికి రాలేదు.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

వివాహితపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కుభీర్: వివాహితపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు భైంసా రూరల్ సీఐ నైలు తెలిపారు. కుభీర్ పోలీసుస్టేషన్‌లో శనివారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మండలంలోని దోడర్నా గ్రామానికి జాదవ్ సాహెబ్రావ్ గత ఆరునెలలుగా లైంగిక వాంఛ తీర్చాలని ఓ వివాహితను వేధించాడు. ఈ విషయం తెలియడంతో ఆమె భర్త అతన్ని హెచ్చరించాడు. ఈనెల 26న వివాహిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో జాదవ్ సాహెబ్రావ్ ఆమెపై లైంగికదాడి చేసి ఆమె ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు రెండు బృందాలు ఏర్పాటు చేసి నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రెండు ఫోన్లు, నిందితుడి బట్టలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న ఎస్సై పి.రవీందర్, పోలీసులను ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



బ్రాంచ్ మెడల్ సాధించిన అనన్య

మంచిర్యాలటౌన్: సికింద్రాబాద్‌లో శనివారం జరిగిన పీఎస్‌బీ మెట్‌లైఫ్ జేబీసీ తెలంగాణ స్థాయి ఓపెన్ టోర్నమెంట్‌లో అండర్–17 విభాగంలో మంచిర్యాల బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అనన్య సెమీఫైనల్‌కు చేరి తృతీయస్థానంలో నిలిచినట్లు ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. బ్రాంచ్ మెడల్‌ను సాధించిన అనన్య జాతీయస్థాయి జేబీసీ టోర్నమెంట్‌కు అర్హత సాధించగా, ఆమెతోపాటు కోచ్ నరేందర్‌ను అసోసియేషన్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు భాస్కర్ల వాసు, బండ మీనారెడ్డి, ట్రెజరర్ సత్యపాల్ రెడ్డి, జాయింట్ సెక్రటరీలు రమేశ్‌రెడ్డి, మధు అభినందించారు.

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ దాడి



పోలీసుల అదుపులో నిందితులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని సాయికుంటలోని సంతోష్‌నగర్ కాలనీలో వ్యభిచారం గృహంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేశారు. పక్కా అందిన సమాచారంతో సీఐ రాజ్‌కుమార్, ఎస్సై ఉపేందర్ తమ సిబ్బందితో కలిసి కాలనీలోని అద్దె ఇంటిపై దాడి చేశారు. ఇందులో ఒక మహిళతోపాటు సీతారాంపల్లికి చెందిన బోలెం శ్రీకాంత్, నిర్వాహకుడు ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం జక్కులపల్లికి చెందిన తోట మహేందర్‌ను అరెస్టు చేశారు. విచారణ నిమిత్తం వారిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ, ఎస్సై తెలిపారు.

అరచేతిలో భగత్‌సింగ్ ముఖచిత్రం



తాంసి: మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన యువకుడు గట్టు రాజు తన అరచేతిపై వినూత్నంగా భగత్‌సింగ్ ముఖచిత్రాన్ని వేసుకుని అబ్బురపరిచాడు. శనివారం భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆయనపై ఉన్న అభిమానంతో అరచేతిలో భగత్‌సింగ్ ముఖ చిత్రాన్ని వేసుకుని ఇలా నివాళిర్పించాడు.

ఆర్‌ఎంపీ రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేందర్

లక్సెట్టిపేట: వైద్యం వికటించి యువకుడి మృతికి కారణమైన దండేపల్లి మండలం కన్నెపల్లికి చెందిన ఆర్‌ఎంపీని శనివారం రిమాండ్ తరలించినట్లు సీఐ నరేందర్, ఎస్సై సతీశ్ తెలిపారు. పోలీసుస్టేషన్‌లో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. లక్సెట్టిపేట మండలం కొత్త కొమ్ముగూడెం గ్రామానికి చెందిన బత్తుల మధుకర్ (26)కు జ్వరం వచ్చింది. గ్రామంలో ఆర్‌ఎంపీ బొడ్డు శ్రీనివాస్ అతనికి చికిత్స అందించాడు. మూడు ఇంజక్షన్లు రెండు గ్లూకోజ్‌లో కలిపి సెలైన్ ఎక్కించి వైద్యం చేయడంతో యువకుడికి చలిజ్వరం వచ్చింది. ఆర్‌ఎంపీ అతన్ని మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడ వైద్యులు పరిశీలించి హైదరాబాద్ లోని యశోద ఆస్పత్రికి రెఫర్ చేశారు. బ్రెయిన్ డెడ్ తర్వాత కుటుంబీకులు మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకురాగా, చికిత్స పొందుతూ ఈనెల 24న మృతిచెందాడు. ఆర్‌ఎంపీ ఇచ్చిన వైద్యం వికటించి తన కుమారుడు మృతిచెందాడని తండ్రి రాజలింగయ్య ఫిర్యాదుతో కేసు నమోదైనట్లు వారు తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



వృద్ధుల చట్టాలను వివరిస్తున్న రిటైర్డ్ జడ్జి

మంచిర్యాలటౌన్: వృద్ధుల కోసం ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రిటైర్డ్ జడ్జి కె.రాజన్న అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రంలోని వృద్ధుల డే కేర్ సెంటర్, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యాన వృద్ధులకు చట్టాలపై అవగాహన కల్పించారు. రిటైర్డ్ జడ్జి మాట్లాడుతూ 60 ఏళ్లు నిండిన వారు వయోవృద్ధులను కుమారులు, కుమార్తెలు చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. రిటైర్డ్ డిప్యూటీ జీఎం రామస్వామి, రాజమల్లు, అడ్వొకేట్ లచ్చన్న, సందాన్, సురేందర్, రెస్పాన్స్ ఆఫీసర్ ఫర్హానా బేగం, డీహెచ్‌ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ సాజన్య పాల్గొన్నారు.

గేదెలను ఢీకొన్న బైక్.. ఒకరి మృతి



ప్రవీణ్ (ఫైల్)

జైపూర్: మండలంలోని ఇందారం రాజీవ్ రహదారిలో గల రైల్వేబ్రిడ్జిపై గేదెలను బైక్ ఢీకొంది. ఈ ఘటనలో యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. జైపూర్ సెకండ్ ఎస్సై నాగరాజు కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన సిర్రం ప్రవీణ్ (25), పొన్నం అజయ్ బైక్‌పై శుక్రవారం మంచిర్యాలలోని బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి రాత్రి ఇంటి వెళ్తుండగా గేదెలను వేగంగా ఢీకొట్టడంతో ప్రవీణ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అజయ్‌ను హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సెకండ్ ఎస్సై తెలిపారు.

టీచర్ల హేతుబద్ధీకరణ ఉత్తర్వులు సవరించాలి



కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న జిల్లా బాధ్యులు

మంచిర్యాలఅర్బన్: పాఠశాల విద్య–ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఉత్తర్వులు సవరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) బాధ్యులు కోరారు. శనివారం ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నంబర్ 25ను సవరించిన తర్వాత ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్నారు. బదిలీ అయి రిలీవ్ చేయని టీచర్లను వెంటనే రిలీవ్ చేసి పాఠశాలలో సర్దుబాటు చేయాలన్నారు. బదిలీలు, పదోన్నతుల అప్పీళ్లను సానుకూలంగా పరిష్కరించాలన్నారు. బోధనేతర పనులు, పాఠశాల పర్యవేక్షణ నిమిత్తం ప్రతీ ప్రాథమిక పాఠశాలలకు హెచ్ఎంలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలన్నారు. వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. యూఎస్‌పీసీ బాధ్యులు రాజావేణు, జయకృష్ణ, నాగలక్ష్మి, కిరణ్, కుమారస్వామి, కళావతి, గంగాధర్, అంజనేయులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

పాతమంచిర్యాల: సీఐటీయూ పిలుపు మేరకు జిల్లా కలెక్టరేట్ ఎదుట శనివారం నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక చట్టాల అమలు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏవో రాజేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాశ్, దాసరి రాజేశ్వరి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజన్న, మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు మహేందర్, మున్సిపల్ కార్మికులు, సంక్షేమ హాస్టల్ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ బకాయిలు వెంటనే చెల్లించాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయి ఉన్న రూ. 33 వేల కోట్లను వెంటనే చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఆర్కే 6, ఆర్కే 7 గనులపై గేట్ మీటింగ్ నిర్వహించి కార్మికులనుద్దేశించి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సింగరేణికి రూ.29 వేల కోట్ల బకాయి పెడితే తాజాగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా మరో రూ. 4 వేల కోట్ల బకాయి పెంచిందన్నారు. ఈ బకాయి డబ్బులు సింగరేణి చెల్లిస్తే సంస్థ అభివృద్ధి కార్యక్రమాలకు ఎంతగానో దోహదపడతాయన్నారు. అంతేకాకుండా సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, ఇది పోవాలన్నారు. సింగరేణి సంస్థకు నష్టం జరిగేలా ప్రభుత్వం గానీ, యాజమాన్యం గానీ ఎలాంటి నిర్ణయం తీసుకున్న కార్మికులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి షేక్ బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, కార్యదర్శి సారయ్య నాయకులు గొర్రె నరసయ్య, అఫ్రోజ్ ఖాన్, సంఘం సదానందం, బీర రవీందర్, చంద్రశేఖర్, చిలుక రామచందర్, రేగుల శంకర్, దొడ్డిపట్ల రవీందర్ పాల్గొన్నారు.

పవర్ ప్లాంటులో కార్మికుల ఆందోళన

- ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని ఆదుకోవాలి
- రూ.15 లక్షలు, కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగాలిస్తామని అధికారుల హామీ



ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీధర్

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడిగా విధుల్లోకి తీసుకోవడం లేదని మనస్తాపంతో మాసు బాలకృష్ణ ఆత్మహత్యకు పాల్పడగా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని హెచ్‌ఎంఎస్, బీఎంఎస్, ఐఎన్‌టీయూసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి పరిహారంతోపాటు కుటుంబంలో ఉద్యోగం కల్పించాలని కార్మికులు, నాయకులు ఎస్టీపీపీ ప్రధాన గేటు వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. సంఘాల నాయకులు, బాధిత కుటుంబీకులతో పవర్‌మేక్ కంపెనీ అధికారులు, ఎస్సై శ్రీధర్ సమక్షంలో చర్చలు జరిపారు. పవర్‌మేక్ కంపెనీ నుంచి తక్షణ సాయం రూ.20వేలు అందించడంతోపాటు రూ.15 లక్షల ఆర్థికసాయం, కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఒప్పందం చేసుకున్నారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించజేశారు.

3 నుంచి బాసరలో దసరా వేడుకలు



బాసర సరస్వతి అమ్మవారు..

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తామని ఈవో విజయరామారావు తెలిపారు. వేడుకల్లో భాగంగా అమ్మవారిని తొమ్మిది రోజులు తొమ్మిది రూపాల్లో అలంకరిస్తామన్నారు. మొదటిరోజు శైలపుత్రిగా, రెండో రోజు బ్రహ్మచారిణిగా, మూడవరోజు చంద్రఘంటా అలంకరణలో, నాలుగోరోజు కూష్మాండ అలంకరణ, ఐదోరోజు స్కందమాతగా, ఆరోరోజు కాత్యాయనిగా, ఏడో రోజు కాళరాత్రిగా, ఎనిమిదో రోజు మహాగౌరీగా, తొమ్మిదోజు సిద్ధిధాత్రిగా అమ్మవారు దర్శనమిస్తారని వివరించారు. నవరాత్రుల సందర్భంగా బాసరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వేడుకలకు రావాలని ఇప్పటికే మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఆయా శాఖల ఉన్నతాధికారులకు ఆహ్వానం అందించినట్లు తెలిపారు.

ఐటీడీఏ ఉద్యాన నర్సరీ సందర్శన



నర్సరీని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉద్యాన నర్సరీ, శిక్షణ కేంద్రాన్ని నిజామాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైయినీ) అజ్మీర సంకేత్ శనివారం సందర్శించారు. నర్సరీలో మొక్కల రక్షణకు తీసుకుంటున్న చర్యలను గురించి ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి సందీప్‌కుమార్‌ని అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సాగు చేస్తున్న పసుపు, టమాట, వరి, జామ తోటలను పరిశీలించారు. హెచ్ఎం సుదీర్‌కుమార్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, నర్సరీ టెక్నికల్ అసిస్టెంట్ అర్పిత ఉన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో రామకృష్ణ ప్రతిభ

మందమర్రిరూరల్: సౌత్ అమెరికాలోని కొలంబియాలో ఈనెల 15 నుంచి 20 వరకు అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీలు నిర్వహించారు. ఇందులో పట్టణానికి చెందిన రామకృష్ణ డబ్ల్యూపీఎస్ తరపున రెస్క్యూ టీమ్ ద్వారా వైస్ కెప్టెన్‌గా పాల్గొన్నాడు. 8 దేశాల నుంచి 21 జట్లు పాల్గొనగా, రామకృష్ణ జట్టు ఓవరాల్‌గా ద్వితీయ స్థానం సాధించింది. కేకే–5 గనిలో సీనియర్ మైనింగ్ సర్దార్‌గా విధులు నిర్వహిస్తున్న బొల్లపల్లి తిరుపతి–విజయలక్ష్మి దంపతుల కుమారుడు రామకృష్ణ శనివారం మొదటి సారిగా ఇక్కడకు వచ్చాడు. తల్లిదండ్రులు అతన్ని ఓపెన్‌టాప్ వాహనంలో బ్యాండ్ మేళాల మధ్య ఊరేగింపుగా ఇంటికి తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.